బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 29 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సస్పెండ్

**బలగం టీవీ, హైదరాబాద్**

జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ, కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ సభ్యత్వాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సస్పెండ్ చేసింది. ఐఎంఏ కోల్‌కతా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఘోష్ సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. అనంతరం ఆర్డర్ కాపీని విడుదల చేసింది."హత్యాచార ఘటనను ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వి అశోకన్ నేతృత్వంలోని కమిటీ సుమోటోగా స్వీకరించింది. ఐఎంఏ ప్రధాన కార్యదర్శితో కలిసి బాధితురాలి తల్లిదండ్రులను కలిసింది. ఆ సమయంలో సందీప్ ఘోష్ తన బాధ్యతను విస్మరించారని వారు చెప్పారు. ఐఎంఏ బంగాల్ రాష్ట్ర శాఖతో పాటు కొన్ని వైద్య సంఘాలు మీ(సందీప్ ఘోష్) పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. అందుకే క్రమశిక్షణా చర్యల కమిటీ మీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యత్వాన్ని సస్పెండ్ చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది" అని ఆర్డర్? కాపీలో ఐఎంఏ పేర్కొంది.

దత్తా, ట్రాఫిక్ పోలీసు వాలంటీర్‌గా పనిచేసిన సంజయ్ రాయ్‌కు గతంలో అనేక సార్లు సహాయపడినట్లు ఆరోపణలు ఉన్నాయి. హత్యాచారం గురించి నిందితుడు దత్తాకు సమాచారమిచ్చి, నేరం నుంచి తప్పించుకునేందుకు ఏమైనా సహాయం కోరాడా అని తెలుసుకునేందుకు సీబీఐ ప్రయత్నిస్తోందని అధికారులు వెల్లడించారు.

# 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు

# 10 లక్షల ఉద్యోగాలు

### 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

- తెలంగాణలో జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రకటించిన కేంద్రం
- ఏపీలోని ఓర్వకల్లు, కొప్పర్తిలో..
- రూ. 28602 కోట్లను వెచ్చించనున్న కేంద్రం



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు, 30 లక్షల పరోక్ష ఉద్యోగాల కల్పించేలా పది రాష్ట్రాల్లో 12 నూతన పారిశ్రామిక నగరాల అభివృద్ధి కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. 28,602 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంలో భాగంగా ఏపీలోని ఆంధ్రప్రదేశ్‌లోని కొప్పర్తి, ఓరకల్లు, తెలంగాణ లోని జహీరాబాద్‌లో పారిశ్రామిక హబ్‌లను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది.

దేశంలోనే కొత్తగా 12 ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన గురువారం జరిగిన కేంద్ర క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఏపీ, తెలంగాణ, బిహార్, పంజాబ్‌లో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేస్తారు. తెలంగాణలోని జహీరా బాద్‌లో 3245 ఎకరాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తారు. ఏపీలోని ఓర్వకల్లు, కొప్పర్తిలో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు కొలువుతీరనున్నాయి.

ఓర్వకల్లులో 2621 ఎకరాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటు కానుంది. ఇక క్యాబినెట్ భేటీ అనంతరం కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ. 28602 కోట్లను వెచ్చించనుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా ఏకంగా రూ. 1.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించవచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది.

ఈ ప్రాజెక్టుతో పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు, 30 లక్షల పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని అశ్వనీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ కారిడార్లలో ప్లగ్ అండ్ ప్లే, వాక్ టూ వర్క్ కాన్సెప్ట్‌పై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. మరోవైపు పోలవరం నిధులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందనేందుకు ఈ నిర్ణయమే ఓ సంకేతమని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ దర్పం, పోరాట స్ఫూర్తి, ఆత్మవిశ్వాసాలకు ప్రతీకగా తెలంగాణ తల్లి



- మన కన్నతల్లుల్ని చూసుకున్నంత సంతోషకరంగా కొత్త రూపం
- సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- డిసెంబర్ 9న లక్షలాది మంది సమక్షంలో వైభవోపేతంగా విగ్రహావిష్కరణ

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ దర్పం, పోరాట స్ఫూర్తి ఉట్టిపడేలా, ఆత్మవిశ్వాసం తొణికిసలాడే విధంగా తెలంగాణ తల్లి విగ్రహం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దొరతనానికి ప్రతీకగా కాకుండా ప్రజలు తమ కన్నతల్లిని చూసుకున్నంత సంతోషకరంగా తెలంగాణ తల్లి రూపం ఉంటుందని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ప్రధాన ద్వారం ముందు తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్యమంత్రి గారు భూమిపూజ చేశారు. మిలియన్ మార్చ్ తరహాలో లక్షలాది మంది సమక్షంలో డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ వైభవోపేతంగా జరుపుతామని ప్రకటించారు.సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏదీ ఉండదని తెలంగాణ ఉద్యమం నిరూపించిందని, ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని ముఖ్యమంత్రి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయ ఆవరణలోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని దశాబ్ది వేడుకల సందర్భంలోనే తాను ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. విగ్రహ నమూనా రూపొందించే బాధ్యతను జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి అప్పగించామన్నారు.

సచివాలయం లోపల తెలంగాణ తల్లి, మరోవైపు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం, దానికి ఎదురుగా పీవీ నర్సింహారావు, అంజయ్య విగ్రహాలు, జైపాల్ రెడ్డి స్మారకం, ఇటువైపు కాకా వెంకటస్వామి తదితర మహానుభావుల విగ్రహాలు, అమరవీరుల స్మారకచిహ్నం –సచివాలయానికి మధ్య దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ గాంధీ విగ్రహం శోభాయమానంగా ఉంటుందని, మేధావుల సూచనల మేరకే ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గడిచిన పదేండ్లలో తెలంగాణ తల్లిని తెరమరుగు చేసిన గత పాలకులు సచివాలయం ఎదురుగా ఉన్న ప్రాంతంలో తమ విగ్రహం పెట్టుకోడానికి ప్రయత్నించారని, అయితే ప్రజల ఆశీర్వాదంతో అధికారంలో వచ్చిన ప్రజా ప్రభుత్వం ఆ ప్రయత్నాలను అడ్డుకొని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ తల్లిని సచివాలయంలో ప్రతిష్ఠిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ అవకాశం దక్కడం తన అదృష్టమన్నారు. బుధవారం తప్పితే దసరా వరకు మంచి రోజులు లేవని వేద పండితులు చెప్పడంతో హుటాహుటిన భూమిపూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు కేరళ వెళ్లడం, మిగతా మంత్రులు ముందే నిర్దేశించిన కార్యక్రమాల్లో ఉండటం వల్ల హాజరుకాలేక పోయారని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## సీఐఎస్ఎఫ్‌కు కొత్త చీఫ్‌ల నియామకం

**బలగం టీవీ, హైదరాబాద్**

దే.శంలో కీలక భద్రతా సంస్థలైన సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్‌లకు కేంద్రం కొత్త చీఫ్‌లను నియమించింది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ డైరెక్టర్ జనరల్‌గా రాజ్వీందర్ సింగ్‌భట్టి నియమితులయ్యారు. సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన రాజ్వీందర్ సింగ్.. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు.అలాగే, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ డైరెక్టర్ జనరల్‌గా దల్జిత్ సింగ్ చౌధరి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఎస్ఎస్‌బీ డీజీగా కొనసాగుతున్నారు. బీఎస్ఎఫ్ చీఫ్‌గా ఆయన వచ్చే ఏడాది నవంబర్ 30వరకు లేదా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతారని కేంద్రం తెలిపింది.

### రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించే విధంగా

## ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ ఉండాలి



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గ్రీన్ ఫీల్డ్ రహదారి అంశాలపై సీఎం సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం అలైన్‌మెంట్ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పడనున్న ఫ్యూచర్ సిటీలో నెలకొల్పనున్న పరిశ్రమలు, అక్కడ నివసించే కుటుంబాలకు అన్నిరకాల వసతులు అందుబాటులో ఉండేలా అలైన్‌మెంట్ ఉండాలన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం, రేడియల్ రోడ్ల నిర్మాణం, డ్రైపోర్ట్‌ను సీ పోర్ట్‌కు అనుసంధానించే గ్రీన్ ఫీల్డ్ రహదారి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు, ప్రధాన కార్యదర్శి, పలువురు ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

దాదాపు 189 కిలోమీటర్ల ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం (చౌటుప్పల్ నుంచి – ఇబ్రహింపట్నం – కందుకూరు ఆమన్ గల్ – చేవెళ్ల – శంకర్ పల్లి – సంగారెడ్డి వరకు) అధికారులు రూపొందించిన అలైన్‌మెంట్‌లో మరికొన్ని మార్పులను ముఖ్యమంత్రి సూచించారు. ప్రతిపాదిత రేడియల్ రోడ్ల ప్రాంతంలో ముందుగానే భూ సమీకరణ, భూ సేకరణ చేయాలన్నారు. భూములిచ్చే రైతులకు సాధ్యమైనంత ఎక్కువ పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు.మనదగ్గర డ్రైపోర్టును ఏపీలోని మచిలీపట్నం, కాకినాడ రేవులతో అనుసంధానం

మిగితా 2వ పేజీలో

## కవితకు ఘన స్వాగతం



**బలగం టీవీ, హైదరాబాద్**

నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్నారు. ఢిల్లీ నుంచి శంషాబాద్‌కు చేరుకున్న కవితకు గులాబీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా గులాబీ నేతలు, కార్యకర్తలు కవితపై పూలవర్షం కురిపించగా.. పార్టీ శ్రేణులకు కవిత అభివాదం చేశారు. పడికిలి బిగించి జై తెలంగాణ అంటూ నినదించారు. కార్యకర్తల జై తెలంగాణ నినాదాలతో ఎయిర్‌పోర్ట్ దద్దరిల్లింది.

ఐదున్నర నెలల తర్వాత హైదరాబాద్ లో అడుగుపెట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు అపూర్వ స్వాగతం లభించింది. మంగళవారం జైలు నుంచి విడుదలైన ఎమ్మెల్సీ కవిత.... బుధవారం మధ్యాహ్నం తన సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్, ఆమె భర్త అనీల్, కుమారుడు ఆదిత్య, ఇతర బీఆర్ఎస్ నాయకులతో కలిసి హైదరాబాద్ కు పయనమయ్యారు.సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు హైదరాబాద్ కు చేరుకున్న ఎమ్మెల్సీ కవితకు శంషాబాద్ విమానాశ్రయంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. " కేసీఆర్ జిందాబాద్ ... బీఆర్ఎస్ జిందాబాద్... జై తెలంగాణ" నినాదాలు మార్మోగాయి. భారీ ర్యాలీతో బంజారాహిల్స్ లోని తన నివాసానికి చేరుకున్నారు. తన నివాసం వద్ద కార్యకర్తలు బాణాసంచ కాల్చి స్వాగతం పలికారు. తన నివాసం వద్ద కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేశారు.

ఇంటికి చేరుకున్న ఎమ్మెల్సీ కవిత తన తల్లి శోభమ్మకు పాదాభివందనం చేసి ఆత్మీయ ఆలింగనం చేశారు. ఈ క్రమంలో వారు భావోద్వేగానికి లోనయ్యారు. అదే సమయంలో తన సోదరుడు కేటీఆర్ కు ఎమ్మెల్సీ కవిత రాఖీ కట్టారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.... నిజం గెలిచిందని, ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కష్టసమయంలో కేసీఆర్ కు, తనకు, తన కుటుంబానికి అండగా ఉన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎటువంటి తప్పు చేయని తాను కడిగిన ముత్యంలా బయటికి వస్తానన్న విశ్వాసం మొదటి నుంచి తనకు ఉందని తెలిపారు. ప్రజల సమస్యలపై ప్రజా క్షేత్రంలో తను కొట్లాడుతూనే ఉంటానని అన్నారు. తాను తెలంగాణకు, తన ఇంటికి రావడం సంతోషంగా ఉందని అన్నారు.



## కోల్‌కతా ఘటన కలిచివేసింది

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**బలగం టీవీ, హైదరాబాద్**

సృష్టించిన కోల్‌కతా వైద్యురాలి లైంగికదాడి, హత్య ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అదో భయానక ఘటన అని, తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. దేశంలో మహిళలపై జరుగుతున్న నేరాలకు ఇకనైనా అడ్డుకట్ట వేయాలని కోరారు. అక్కాచెల్లెళ్లు, కుమార్తెలు ఇలాంటి అఘాయిత్యాలకు గురికావడాన్ని ఏ నాగరిక సమాజం కూడా అనుమతించదని తెలిపారు. ఈమేరకు పీటీఐ వార్తా సంస్థకు చెందిన ఎడిటర్లతో చర్చించి, తాను రాసి సంతకం చేసిన ప్రత్యేక వ్యాసంలో వ్యాఖ్యానించారు.

"ఒకవైపు విద్యార్థులు, డాక్టర్లు, పౌరులు సహా అనేక మంది కోల్‌కతాలో నిరసనలు చేపడుతుంటే మరోవైపు నేరస్థులు మాత్రం స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. బాధితుల్లో అనేక మంది చిన్నపిల్లలూ ఉన్నారు. ఆకృత్యాలకు ఏ నాగరిక సమాజం కూడా తమ కుమార్తెలను, సోదరీమణులను ఎప్పటికీ బలి ఇవ్వదు. నిర్భయ ఘటన జరిగిన 12 ఏళ్ల కాలంలో సమాజం ఎన్నో అత్యాచార ఘటనలను మరిచిపోయింది. ఇటువంటి సామూహిక మతిమరుపు అసహ్యకరమైనది. గత తప్పులను ఎదుర్కొనేందుకు సమాజం భయపడుతోంది. కానీ ఇప్పుడు చరిత్రను సమూలంగా మార్చేందుకు సమయం ఆసన్నమైంది. సమగ్రమైన రీతిలో ఈ సమస్యను నిర్మూలించేందుకు ప్రయత్నిద్దాం" ఆమె పేర్కొన్నారు.

## ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటా




- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


**బలగం టీవీ, హైదరాబాద్**

ములుగు జిల్లాలో ఒక గ్రామాన్ని త్వరలోనే దత్తత తీసుకుంటానని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం గోవిందరావుపేట మండలం బుస్సాపురం గ్రామంలోని పర్యాటక ప్రాంతమైన లక్నవరానికి చేరుకొని ఆయన బస చేశారు. బుధవార ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అనంతరం మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి సరస్సులో గవర్నర్ స్పీడ్ బోటు షికారు చేస్తూ లక్నవరం అందాలను తలకించారు.

తాను ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని గవర్నర్ వెల్లడించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ జిల్లాలో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటామని గవర్నర్ హామీ ఇవ్వడం చాలా అభినంద నీయ మని అన్నారు. గవర్నర్ పర్యటనకు సహకరించిన కలెక్టర్, పోలీసులు, ప్రజలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తిరుగు ప్రయాణంలో గవర్నర్

మిగితా 2వ పేజీలో

## 'నాగార్జునసాగర్'కు వరద ప్రవాహం



**బలగం టీవీ, హైదరాబాద్**

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. దీంతో అధికారులు 12 క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌కు 1,26,796 క్యూసెక్కుల వరద వస్తున్నది. అంతే మొత్తం కిందికి వెళ్తున్నది. జలాశయం పూర్తి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 590 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలుగా ఉన్నది.

# కొడంగల్‌లో పాఠశాల మూతపడటం సిగ్గుచేటు



- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ లో ఉపాధ్యాయుల్లేక పాఠశాల మూతపడటం సిగ్గుచేటని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని అంటూ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పి, ఇప్పుడు ఉన్న ప్రభుత్వ స్కూళ్లను మూతపడేలా చేస్తున్నారని విమర్శించారు.. ఇలా బడులు మూసివేసి .. పేద పిల్లలకు ప్రాథమిక విద్యను దూరం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు మూతపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు ? విద్యాశాఖ కూడా ముఖ్యమంత్రి వద్దే ఉన్నప్పటికీ విద్య పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు హరీశ్.. తక్షణమే పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించి పాఠశాలను మూతపడకుండా చూడాలని కోరారు, మూతపడ్డ పాఠశాలలను తెరిపించి విద్యా బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హరీశ్ డిమాండ్ చేశారు.

ఆహార పంటల బదులు పప్పుధాన్యాల సాగుతో మెరుగైన లాభాలు సాధించవచ్చన్న రైతుల ఆశలు అడియాశలు చేసేలా మీ ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు.

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటా పెసరకు మద్దతు ధర రూ.8,682 ప్రకటించినప్పటికీ ఆ ధరకు ఎవరూ కొనుగోలు చేయని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో వ్యవసాయ మార్కెట్లు, గ్రామీణ ప్రాంతాల వ్యాపారులకు పంటను క్వింటా రూ.6,000 నుంచి రూ.6,500 మధ్యనే రైతులు విక్రయిన్నారని పేర్కొన్నారు. ప్రైవేటు వ్యాపారులు ఆడిందే ఆటగా మారటంతో రైతులు క్వింటాకు రూ.2,500 పైగా నష్టపోతున్నారన్నారు.

ఈ సంవత్సరం మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో మీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం ప్రదర్శించడం పెసర పంట రైతులకు శాపంగా మారిందన్నారు. కష్టపడి పండించిన పంటను మద్దతు ధరకు విక్రయించే పరిస్థితి లేదని ఖమ్మం, మహబూబాబాద్, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, నారాయణ పేట, సూర్యాపేట తదితర జిల్లాల రైతులు తీవ్ర ఆవేదన, ఆందోళన చెందుతున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ఇప్పటికే రుణమాఫీ, రైతు బంధును అటకెక్కించిన మీ ప్రభుత్వం మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తామన్న మాటను బోగస్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు మంగళం పాడారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అదే తీరుగా ఇప్పుడు మద్దతు ధర ప్రకారం పంటలు కొనుగోలు చేసే బాధ్యతను విస్మరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో పంటలు పండించడం, పండించిన పంటలను విక్రయిం చుకోవడం రైతన్నకు కత్తిమీద సాముగా మారిందన్నారు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచుతున్న తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి వ్యవసాయ, రైతు వ్యతిరేక విధానాలను వీడాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా పెసర కొనుగోలు కేంద్రాలు, జిల్లాల్లో తక్షణం ఏర్పాటు చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా చూడాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

### రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించే విధంగా

# ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

చేసే అవకాశాలపై అధ్యయనం చేశాకే గ్రీన్ ఫీల్డ్ హైవేకు రూపకల్పన చేయాలని, ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని సీఎం అన్నారు. మధ్య రావిర్యాల నుంచి అమన్‌గల్ వరకు నిర్మించనున్న రహదారిలో మూడు చోట్ల ఉన్న అటవీ ప్రాంతాలను నైట్ సఫారీలుగా మార్చే అంశంపై కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. కాలిఫోర్నియాలో ఆపిల్ పండ్లతోటలోనే 'ఆపిల్' సంస్థ కార్యాలయం, బెంగళూరులో జిందాల్ నేచర్ కేర్ తరహాలో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలోనూ పర్యావరణహిత నిర్మాణాలకు అధ్యయనం చేయాలన్నారు. ప్రకృతి సౌందర్యానికి నెలవైన రాచకొండలో సినీ పరిశ్రమ అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు.

ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, ఫోర్త్ సిటీలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ సమీకరణ, భూ సేకరణ విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

# హొటల్ గదిలో రహస్య సీసీ కెమెరాలు




**బలగం టీవీ, హైదరాబాద్**

శంషాబాద్‌లో ఓయో హొటల్ నిర్వాహకుడి నిర్వాకం తాజాగా వెలుగు చూసింది. హొటల్ గదిలో రహస్య సీసీ కెమెరాను హొటల్ నిర్వాహకుడు ఏర్పాటు చేశాడు. రూమ్ అద్దెకు తీసుకున్న వ్యక్తుల అశ్లీల చిత్రాలను చిత్రీకరించి బాధితులను ఓయో హొటల్ నిర్వాకుడు బెదిరిస్తున్నాడు. ఓ జంట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు హొటల్‌ను తనిఖీ చేసి రహస్య సీసీ కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు వద్ద నుంచి రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శంషాబాద్‌లో సీతా గ్రాండ్ పేరుతో హొటల్‌ను ఒంగోలుకు చెందిన గోపాల్ అనే వ్యక్తి నడిపిస్తున్నాడు. విమానాశ్రయం ఉండే రహదారి పక్కన ఉండడంతో ఈ హొటల్‌కు ఎక్కువగా యువత వచ్చి వెళ్తూ ఉంటారు. దీనిని అవకాశంగా మార్చుకుని రూముల్లోని బల్బుల్లో రహస్యంగా కెమెరాలు అమర్చి, వారి వీడియోలను చిత్రీకరించేవాడు. మళ్లీ బాధితులకే పంపి, వారి నుంచి డబ్బులు డిమాండ్ చేసి వసూలు చేస్తున్నాడు. ఇదేమి అన్యాయమని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దాడులు నిర్వహించి యజమానిని అరెస్ట్ చేశారు.

## జూనియర్ కళాశాలల్లో 2,280 తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి అనుమతి

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో జూనియర్ కళాశాలల్లో 2,280 తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జూనియర్ కళాశాలల్లో 1654 గెస్ట్ లెక్చరర్, 449 కాంట్రాక్ట్, 96 పార్ట్ టైం, 78 ఔట్ సోర్సింగ్, 3 మినిమం టైం స్కేల్ అధ్యాపకుల భర్తీకి అనుమతి ఇస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది మార్చి 31 వరకు కాలేజీల్లో బోధించేందుకు ఇంటర్ విద్యాశాఖ ఈ తాత్కాలిక నియామకాలు చేపట్టనున్నది.



జైలు నుంచి విడుదలై హైదరాబాద్‌కు వచ్చిన కవితకు ఘనస్వాగతం లభించింది. తన ఇంటి వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న దృశ్యం

### తెలంగాణలో

## మరిన్ని ఎఫ్ ఎమ్ రేడియో స్టేషన్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా 234 నగరాల్లో కొత్తగా ఎఫ్.ఎమ్ రేడియో సౌకర్యం కల్పించనున్నారు. అందులో భాగంగా.. తెలుగు రాష్ట్రాల్లో కూడా మరిన్ని ఎఫ్.ఎమ్ రేడియో కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే ముఖ్యమైన నగరాల్లో ఎఫ్. ఎమ్ రేడియో సౌకర్యం ఉండగా.. తాజాగా మరిన్ని నగరాలలో ఎఫ్.ఎమ్ రేడియో స్టేషన్లు విస్తరించనున్నాయి. అందులో ఏపీలో 22 పట్టణాల్లో, తెలంగాణలో 10 పట్టణాల్లో ఎఫ్. ఎమ్ రేడియో సౌకర్యం కల్పించనుంది.

తెలంగాణలో 31

తెలంగాణలో 31 ఎఫ్.ఎమ్ రేడియో స్టేషన్లు కానున్నాయి. అందులో.. ఆదిలాబాద్ 3, కరీంనగర్ 3, ఖమ్మం 3, కొత్తగూడెం 3, మహబూబ్ నగర్ 3, మంచిర్యాల 3, నల్గొండ 3, నిజామాబాద్ 4, రామగుండం 3, సూర్యాపేటలో 3.. ఎఫ్.ఎమ్ రేడియో స్టేషన్లు కొత్తగా ఏర్పాటు కానున్నాయి.

# త్వరలో హైడ్రా పేరిట ప్రత్యేక చట్టం

**బలగం టీవీ, హైదరాబాద్**

త్వరలో హైడ్రా పేరిట ప్రత్యేక చట్టం రూపొందించనున్నట్లు కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. దీనికి సంబంధించిన విధివిధానాలు, నిబంధనలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. అమల్లోకి వచ్చాక త్వరలోనే హైడ్రా పేరిట స్వయంగా నోటీసులు ఇస్తామన్నారు. హైడ్రా పేరుతో పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని, వీటిలో ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇప్పటివరకు తమ విచారణలో తేలిన అవినీతి అధికారులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

హైదరాబాద్‌లో చెరువులను ఆక్రమించిన వారి నిర్మాణాలను హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీని రాష్ట్ర ప్రభుత్వం జులై 19న ఏర్పాటు చేసింది. హైదరాబాద్ పరిధిలోని చెరువుల సంరక్షణ, విపత్తుల నిర్వహణ, క్రీడా మైదానాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ వంటివి హైడ్రా బాధ్యతలు.

# ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటా

(మొదటి పేజీ తరువాయి)

ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాను సందర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా విషపురుగు కాటుకు గురైన కానిస్టేబుల్‌ను పరామర్శించారు. గవర్నర్ వెంట టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఎస్పీ డాక్టర్ పి. శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డితో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

## రైళ్లపై దాడులకు కుట్ర

- **కలకలం సృష్టిస్తోన్న ఉగ్రవాది వీడియో!**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్‌లో దాడులకు పాల్పడాలంటూ ఓ ఉగ్రవాది స్లీపర్ సెల్స్‌కు ఆదేశాలు ఇస్తోన్న వీడియో ఆందోళన రేకెత్తిస్తోంది. రామేశ్వరం కేఫ్ తరహాలోనే, దేశవ్యాప్తంగా రైళ్లపై దాడి చేయాలని ఉగ్రవాదులు ప్రణాళిక రచిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఆ ఉగ్రవాది పేరు ఫర్హతుల్లా ఘోరి అని తెలుస్తోంది. ఈ ఉగ్రవాది పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ ఇంటిలిజెన్స్ సహకారంతో స్లీపర్ సెల్ ద్వారా రామేశ్వరం కేఫ్‌లో బ్లాస్ట్‌కు పాల్పడ్డాడని నిఘావర్గాలు వెల్లడించాయి.

ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంటున్న ఫర్హతుల్లా ఘోరిపై కొన్నేళ్లుగా భారత్ నిఘా వేస్తోంది. అతడు ఆదేశాలు ఇస్తోన్న మూడు నిమిషాల వీడియో కొద్ది రోజుల క్రితమే సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చింది. అందులో రైళ్లు, పెట్రోలియం పైప్‌లైన్‌లపై దాడులు, ప్రెజర్ కుక్కర్లు ఉపయోగించి పేలుళ్లు జరపాలంటూ విపరీత వ్యాఖ్యలు చేసినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. భారత ప్రభుత్వం స్లీపర్ సెల్స్ ఆస్తులపై దాడులు చేస్తూ, వారిని బలహీనపరుస్తోందని ఘోరి వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడు ఆ ప్రభుత్వాన్ని షేక్ చేయాలంటూ ప్రగల్భాలు పలికాడు. దీనితో నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టపోయి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆన్ లైన్ బెట్టింగ్‌లో ఆర్థికంగా నష్టపోయిన వ్యక్తి మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్న ఘటన కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జైనూర్ ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇచ్చోడ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన గుగ్గె కిరణ్ (26) అనే వ్యక్తి గత 5సంవత్సరాల నుండి వ్యాపార నిమిత్తం కోసం కెరమెరి మండలానికి వెళ్లి అక్కడే నివాసం ఉంటున్నాడు. అతనికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతూ ఉండేవాడు. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్లో తీవ్రంగా నష్టపోయాడు. అప్పుల బాధ భరించలేక మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 21న కిరణ్ ఇంటి నుంచి ద్విచక్ర వాహనం ఫైనాన్స్ డబ్బులు కట్టడానికి ఆదిలాబాద్ వెళ్తా అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు కిరణ్ తన భార్య శీతల్‌కు ఫోన్ చేసి జైనూర్ మండలంలోని కాశీ పటేల్ గూడా సమీపంలో పురుగుమందు తాగి ఉన్నాను అని చెప్పడంతో ఆమె భార్య శీతల్ వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని కిరణ్ ను వెంటనే జైనూర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతుడి భార్య శీతల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

## రాంనగర్‌లో హైడ్రా కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

**బలగం టీవీ, హైదరాబాద్**

ముషీరాబాద్ నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆకస్మికంగా పర్యటించారు. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ గల్లీలో నాలాపై అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికుల ఫిర్యాదుమేరకు అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ పరిశీలించారు. మణెమ్మ గల్లీలో రోడ్డు ఇరుకుగా మారిందని, నాలా.. రోడ్డును ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇళ్లలోకి వరదనీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు మొరపెట్టుకున్నారు. నాలా ఆక్రమణ, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలు, సబంధిత స్థల పత్రాలను పరిశీలించాలని జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

# లైంగికదాడికి పాల్పడితే ఉరిశిక్ష

- **బెంగాల్ సీఎం మమతా బెనర్జీ**

**బలగం టీవీ, హైదరాబాద్**

'బెంగాల్ తగలబడితే, తర్వాత అస్సాం, బీహార్, జార్ఖండ్, ఒడిశా, ఢిల్లీ కూడా తగలబడతాయి అనే విషయం గుర్తుంచుకోండి' అంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో తాజా ఘటనలను ఉద్దేశించి బుధవారం కోల్‌కతాలో తృణమూల్ విద్యార్థి విభాగం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మమత వ్యాఖ్యలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. 'దీదీ, అస్సాంను బెదిరించేందుకు ఎంత ధైర్యం? మాపై కళ్లు ఎర్రవి చేసి చూడకండి. మీ విఫల రాజకీయాలతో దేశాన్ని తగలబెట్టేందుకు ప్రయత్నించకండి' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాజ్యాంగ పదవిలో ఉండి మమతా బెనర్జీ దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సుకాంత మజుందార్ లేఖ రాశారు. 'నేను ఎప్పుడూ ప్రతీకారాన్ని కోరుకోలేదు. కానీ ఇప్పుడు ఏది అవసరమైతే అది చేయండి' అని అమిత్ షాను కోరారు.



లైంగికదాడి ఘటనలను తమ ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించబోదని, రేపిస్టులకు ఉరిశిక్ష పడేలా ప్రస్తుతం ఉన్న చట్టాలను సవరిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. వచ్చే వారమే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని, దీనిని గవర్నర్ ఆమోదించకపోతే రాజ్‌భవన్ ముందు తానే ధర్నాకు దిగుతానని తెలిపారు. ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు తిరిగి విధుల్లో చేరాలని ఆమె కోరారు. హత్యాచార ఘటనలో సీబీఐ విచారణ చేపట్టి 16 రోజులు గడుస్తున్నప్పటికీ న్యాయం ఎక్కడ జరిగిందని ఆమె ప్రశ్నించారు.

# చేవెళ్ల ఎమ్మెల్యే వాహనంపై కోడిగుడ్లతో దాడి



**బలగం టీవీ, హైదరాబాద్**

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వాహనంపై కోడిగుడ్లతో దాడి చేశారు. షాబాద్ వద్ద కాలె యాదయ్య వాహనంపై కోడి గుడ్లతో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కోసం కాలె యాదయ్య షాబాద్‌కు రావడంతో సొంత పార్టీ కార్యకర్తల నుంచి ఆయనకు నిరసనసెగ తగిలింది. చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ భీమ్ వర్గాన్ని కలుపుకొని పోవడంలేదని కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలిపారు. గత పది ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారిని గుర్తించకుండా బిఆర్ఎస్ నుండి వచ్చిన వారిని వెంట వేసుకొని తిరుగుతున్నారని ఆగ్రహంతో కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా చేశారు. గో బ్యాక్ ఎమ్మెల్యే, గో బ్యాక్ ఎమ్మెల్యే అంటూ నినాదాలు చేశారు. మాకు న్యాయం చేసేంత వరకు తాము వినేదిలేదని నిరసన తెలిపారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయడం జరిగింది. ఇటీవల కాలె యాదయ్య బీఆర్ఎస్ పార్టీ నుంచి సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరడంతో నియోజకవర్గం ఇంచార్జీ భరత్, స్థానిక కాంగ్రెస్ వ్యతిరేకత చూపించినట్టు సమాచారం. ఇవాళ షాబాద్‌కు యాదయ్య రావడంతో ఆయనపై భరత్ వర్గీయులు కోడిగుడ్లతో దాడి చేసినట్టు సమాచారం.

# సోనియా, రాహుల్ కూడా బీజేపీతో కుమ్మక్కయ్యారా?



**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటైనందునే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిందంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు పనికిమాలిన స్టేట్‌మెంట్లు చేస్తూ రాజకీయ ప్రయోజనం పొందాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కవితకు బెయిల్ రావటానికి బిజెపితో కుమ్మక్కు అయితే మరి నేషనల్ హెరాల్ కేసులో 2015 డిసెంబర్‌లో ఈడీ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇద్దరికీ బెయిల్ వచ్చిందని, కాంగ్రెస్ కూడా ఎన్‌డీఏతో కుమ్మక్కు అయితేనే బెయిల్ వచ్చిందా..? అని ప్రశ్నించారు. ఇండియా కూటమిలో భాగమైన ఎఏపి నేత మనీష్ సిసోడియాకు కూడా వారం రోజుల క్రితమే బెయిల్ వచ్చిన విషయాన్ని కెటిఆర్ ప్రస్తావించారు. ఓటుకు నోటు కుంభకోణంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి 2015 నుంచి బెయిల్‌పై ఉన్నారన్న సంగతి కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టాలకోవాలని పేర్కొన్నారు. ఇవన్నీ కూడా ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే జరిగాయని, కనుక వీరంతా ఎన్‌డిఎ భాగస్వాములేనని అనుకోవాలా అని కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు.

# 5 నెలల్లోనే కవితకు బెయిల్ ఎలా వచ్చింది?



**సిసోడియా, కేజ్రీవాల్‌కు రాని బెయిల్ 5 నెలల్లోనే కవితకు ఎలా వచ్చింది?**

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్‌పై తీహార్ జైలు నుంచి బయటకు వచ్చి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. "కవిత బెయిల్ కోసం ఎంపీ సీట్లు బీఆర్ఎస్ త్యాగం చేసింది నిజం బీఆర్ఎస్ – బీజేపీ ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందన్నారు. సిసోడియా, కేజ్రీవాల్‌కు రాని బెయిల్ 5 నెలల్లోనే కవితకు ఎలా వచ్చింది? మెదక్, సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్లో బీజేపీకి మెజారిటీ ఇచ్చింది నిజం కాదా ఏడు చోట్ల డిపాజిట్ కోల్పోయి, 15 చోట్ల మూడవ స్థానం వచ్చేంత బలహీనంగా బీఆర్ఎస్ ఉందా?" అని సీఎం రేవంత్ ప్రశ్నించారు.

ప్రభుత్వం చేస్తున్న పనులకు చేరికలకు సంబంధం లేదని, ఎవరినో భయపెట్టి చేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. తమ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉందని, ప్రభుత్వ విధానాలు నచ్చి వస్తే చేర్చుకుంటామని తెలిపారు. చెరువుల కబ్జాపై నిజనిర్ధారణ కమిటీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కమిటీకి హరీష్ రావు నేతృత్వం వహించినా ఫర్వాలేదన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ మాట్లాడాలనే కోరుకుంటున్నామని, ప్రభుత్వం ప్రతిపక్ష నేతగా జీతభత్యాలు తీసుకుంటున్నారు.. మరి పనిచేయాలిగా? అని ప్రశ్నించారు.

ప్రజల ప్రయోజనం కోసమే హైడ్రా తెచ్చామని చెరువులో నిర్మాణాలు చేస్తే ఎంతటి వారైనా ఒకటే యుద్ధ ప్రాతిపాదికన కూల్చివేతలు పూర్తిచేస్తామన్నారు. లీడర్స్, హీరోలు ప్రజలకు రోల్ మోడల్ గా ఉండాలని సూచించారు.

"కేసీఆర్ ప్రభుత్వం 2018–24 వరకు రుణమాఫీ చేసింది 13,329 కోట్లు. మా ప్రభుత్వం 27 రోజుల్లో 18 వేలకోట్లు రుణమాఫీ చేశాం. రైతును రుణవిముక్తి చేయడం మా లక్ష్యం.. టెక్నికల్ అంశాలతో రుణమాఫీ జరగని వారు కలెక్టర్‌కు వివరాలు ఇవ్వండి. రుణమాఫీ కానీ వారి వివరాలు కేటిఆర్, హరీశ్ కూడా ఇవ్వొచ్చు.. వారి వివరాలు ఇచ్చి పాపాలు కడుక్కోండి. అక్రమ కట్టడాల కూల్చివేతపై కేసీఆర్ ప్రభుత్వం ఎలా వ్యవహరించిందో తెలుసు. గతంలో స్వార్థం కోసం.. నిర్మాణాల కూల్చివేత జరిగింది.. ఆగింది. కానీ నేను రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌ను కాను.. ఆయనతో పోలికే ఉండదు" అని సీఎం రేవంత్ అన్నారు.

జన్వాడలో కేటీఆర్ ఫామ్ హౌజ్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. చెరువులు కబ్జా చేసినా ఎవరిని వదిలిపెట్టమన్నారు. రూల్స్ అతిక్రమించి కట్టిన ఫామ్ హౌస్?ను కేటీఆర్ ఎలా లీజుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఫామ్ హౌజ్ లీజుకు తీసుకున్న విషయం.. కేటీఆర్ ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారా అని అడిగారు. ఒకవేళ అఫిడవిట్‌లో చెప్పకపోతే న్యాయవిచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు ఆదర్శంగా ఉండాలని చెప్పారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో తన బంధువుల ఇళ్లుంటే తానే వాటిని దగ్గరుండి కూల్చేస్తానని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతానికి హైదరాబాద్ వరకే హైడ్రా పరిమితమని తెలిపారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, పార్కులు, నాలాలను కాపాడటమే తమ మొదటి ప్రాధాన్యమన్నారు.

# 30 నుంచి తెలంగాణలో అతి భారీ వర్షాలు



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో ఈ నెల 30నుంచి భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలతో పాటు అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.. ఈనెల 30 నుంచి అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే జాబితాలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉన్నట్లు తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. భారీ నుంచి అతిభారీ వర్షాలు కుమురంభీం, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పడతాయని వెల్లడించింది.

అదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చెల్ మల్కాజిగిరి ,మెదక్,కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈనెల 31 నుంచి అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. సెప్టెంబర్ ఒకటో తేదీన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే జిల్లాల్లో ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# తిరుమల తరహాలో వేములవాడలో నిత్యాన్నదాన సత్రం..

- సత్రం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి..
- ఇప్పటికే బ్రేక్ దర్శనం అమలు చేస్తున్నాం..
- ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు
- మంత్రి పొన్నం ప్రభాకర్..



**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

తిరుమల తరహాలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు . వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ని మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈఓ వినోద్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌కి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, ప్రభుత్వ విప్ నకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు అద్దాల మండపంలో మంత్రి, విప్, కలెక్టర్, ఎస్పీకి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న కార్తీకమాసంలోగా భక్తులకు నిత్యాన్న సత్రం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతున్నామని అన్నారు . సత్రం ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని అన్నారు . రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ ఆలయం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి భక్తులకు స్వామివారి దర్శనం వేగంగా కల్పించేందుకు, మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆలయ అభివృద్ధికి శృంగేరి పీఠం, పండితులు, భక్తుల సూచనల మేరకు ముందుకు వెళ్తామని అన్నారు.రాజన్న కోడెల సమస్యలను పరిష్కరించామని గుర్తు చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం, మంత్రులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని అన్నారు .


ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రావణ మాసం ఆరంభం నుంచి భక్తుల కోసం బ్రేక్ దర్శనాన్ని అమల్లోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఇప్పటిదాకా 1400 మంది భక్తులు దర్శించుకోగా, దాదాపు రూ. 15 లక్షల ఆదాయం సమకూరిందని అన్నారు.ఇప్పటికే 1500 కోడెల కలెక్టర్ అధికారులతో కలిసి రైతులకు అందజేశామని,అలాగే కోడెల కోసం మూడు షెడ్లు నిర్మించామని, మరొకటి నూతనంగా నిర్మిస్తున్నామని అన్నారు . భక్తులకు వసతి కల్పించేందుకు గదులు నిర్మించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని అన్నారు.

**ఎక్కడా లేని విధంగా రెండు లక్షల రుణమాఫీ..**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి.వేములవాడ లో 300 ఎంటీఎస్ గోదాం, పీఏసీఎస్ ఆన్లైన్ సర్వీస్ డిజిటల్ సేవా కామన్ సర్వీస్ సెంటర్ ను, ది కరీంనగర్ జిల్లా సహకార బ్యాంక్ వేములవాడ శాఖ నూతన భవనాన్ని, బ్యాంక్ ఏటిఎం ను మంత్రి పొన్నం ప్రభాకర్,విప్ ఆది శ్రీనివాస్, నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు తో కలిసి ప్రారంభించారు. సహకార బ్యాంక్ నుండి విద్యా లోన్ ,గృహ లోన్, స్వయం ఉపాధి లోన్ చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఇప్పుడు దేశంలో ఎక్కడ లేని విధంగా మొదటి దశ లో లక్ష ,రెండో దశ లక్ష 50 వేలు ,మూడో దశలో రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేశామని, 2018 డిసెంబర్ 12 ముందు లోన్ తీసుకొని బకాయిలు ఉన్నవారు, 2023 డిసెంబర్ 9 తరువాత తీసుకున్న వారికి లోన్ మాఫీ కాలేదని స్పష్టం చేశారు. 265 రోజుల్లో 85 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, 2500 కోట్ల రూపాయలు విలువైన ఉచిత టికెట్లపై ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. వేములవాడ, కొండగట్టు, ఇతర ఆలయాలకు పోవాలన్న బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని అన్నారు . యావత్ తెలంగాణ లో 70 శాతానికి పైగా మంది 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వాడుకుంటున్నారని, రూ. 500 కి గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని అన్నారు.

వచ్చే నెల 17వ తేదీ నుంచి ప్రజా పాలనలో భాగంగా ఆరు గ్యారంటీల అమలు దరఖాస్తులు స్వీకరిస్తామని, నూతన రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్ చైర్మన్ బింగి మహేష్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అర్బన్ తాసిల్దార్ మహేష్ కుమార్, వేములవాడ పిఏసిఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, ఆయా సంఘాల చైర్మన్లు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.







## సిరిసిల్లలో నేత కార్మికుడి ఆత్మహత్య..

**బలగం టీవీ , సిరిసిల్ల**

చేతినిండా పని లేక, ఆర్థిక సమస్యలు అధికమవడంతో మనస్థాపం చెంది ఉరి వేసుకుని నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... జక్కని సతీష్ (30)కు వివాహం కాలేదు, తల్లిదండ్రులు చనిపోవడంతో తన అక్క సువర్ణ దగ్గర ఉంటున్నారు. మూడు నెలలుగా పని లేకపోవడంతో అక్క సువర్ణ బీడీలు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఓవైపు కుటుంబ పోషణ, మరో వైపు ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో జక్కని సతీష్ మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అక్క సువర్ణ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## కానిస్టేబుల్‌కు గవర్నర్ పరామర్శ

**బలగం టీవీ , ములుగు**

పాము కాటుకు గురై ములుగు ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పోలీస్ కానిస్టేబుల్ ప్రశాంత్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మంత్రి దనసరి సీతక్కతో కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. గవర్నర్ వెంట జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ షబరిష్, తదితరులు ఉన్నారు.

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ములుగు జిల్లా పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘ టనలు చోటు చేసుకోకుండా గ్రేహౌండ్స్‌తో అధికారులు ముందస్తుగా భారీగా భద్రతా దళాలను మోహరిం చారు. వెంకటాపూర్ మండలంలోని దట్టమైన అడవిలో విధుల్లో ఉన్న గ్రేహౌండ్ పోలీస్ కానిస్టేబుల్ గుండ్ల ప్రశాంత్ అనే వ్యక్తికి పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి సిబ్బంది హుటాహుటున కానిస్టేబ ల్‌ను ములుగు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు తరలించి వైద్యమందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

# మాజీ నక్సలైట్ల పేరుతో బెదిరింపులు..



- ఐదుగురు అరెస్టు

**బలగం టీవీ, సిరిసిల్ల :**

మాజీ నక్సలైట్ల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వారిని త్వరలో అరెస్టు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలను తెలిపారు. రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన జక్కు ధరణి ,బోయినపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన కమటం కృష్ణవంశీ ఇద్దరు ప్రేమించుకొని 2022 సంవత్సరంలో పెళ్లి చేసుకున్నరు.ఈ పెళ్లి ధరణి కుటుంబ సభ్యులకు ఇష్టం లేనందున ఎలాగైనా తమ కూతురి మనసు మార్చి తమ కులం వారికి ఇచ్చి పెళ్లి చేయాలని అనుకోని కామారెడ్డి జిల్లాకి చెందిన గొట్టే పద్మ,గొట్టే మనోహర్ (మాజీ నక్సలైట్లు) లను ధరణి అమ్మ లక్ష్మీ ,అన్న రాజశేఖర్ లు కలువగా 5,00,000/- రూపాయలు ఇస్తే మేము పరిష్కారిస్తాం అని ఒప్పదం చేసుకొని, ధరణిని కిడ్నప్ చేయడానికి ఒక సంవత్సరం నుండి ప్రయత్నం చేస్తున్నారు. ధరణి అమ్మ,అన్న, మర్రి గడ్డ గ్రామానికి చెందిన కత్తి రాము, వేములవాడ గ్రామానికి చెందిన ఎక్కలదేవి బాలకిషన్, టిల్లు జగదీష్ ల సహాయంతో గత వారం రోజుల క్రితం ధరణి ని అత్తగారి ఇంట్లో నుండి కిడ్నాప్ చేయడానికి ప్రయత్నం చేయగా, ధరణి ఆడపడుచు ఆపడానికి ప్రయత్నం చేసింది. అయితే వారి వారి కళ్లల్లో పెప్పర్ స్ప్రే కొట్టి ధరణిని బలవంతంగా తీసుకువెళ్లి ధరణి మనసు మార్చాలని ప్రయత్నం చేశారు. ధరణి అత్తగారి కుటుంబ సభ్యులు బోయినపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు,వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న వారు ధరణిని బూరుగుపల్లి గ్రామ శివారులో విడిచిపెట్టి వెళ్లారు. ధరణి తనను వదిలి పెట్టారని బోయినపల్లి పోలీసులకు తెలుపగా జక్కు లక్ష్మి,జక్కు రాజశేఖర్ , కత్తి రమేష్ ఏ రాము,గొట్టే మనోహర్ ,గొట్టే పద్మ , ఎక్కలదేవి బాలకృష్ణ , టిల్లు,జగదీష్ అలియాస్ జగ్గూ లపై కేసు నమోదు చేసి,ఆదివారం జక్కు లక్ష్మి ,జక్కు రాజశేఖర్ , కత్తి రమేష్ అలియాస్ రాము,గొట్టే మనోహర్, ఎక్కలదేవి బాలకృష్ణ వేములవాడ బాల్ నగర్ ప్రాంతంలో అదుపులోకి తీసుకొని రిమాండ్ కి తరలించారు. గొట్టే పద్మని వేములవాడ లో అదులోకి తీసుకొని రిమాండ్ కి తరలించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. అరెస్టు వారందరిని రిమాండ్ కు తరలించామని పరారిలో ఉన్న ఇద్దరిని త్వరలోనేపట్టుకుంటామని అన్నారు.

కొనరావుపేట మండలనికి చెందిన గొట్టే మనోహర్ ప్రస్తుతం కామారెడ్డి లో ఉంటున్నాడు, గొట్టే మనోహర్ మాజీ నక్సలైట్, అతని భార్య గొట్టే పద్మ వీరు ఇద్దరు కలసి ,ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం అని అమాయక ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు.వీరి పై రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి ,జగిత్యాల జిల్లాలో పలు కేసులు నమోదు అయ్యాయని,గొట్టే పద్మ, మనోహర్ లకి సంబంధించిన బాధితులు ఎవరైనా ఉంటే సబంధిత పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయాలని, అంతే కాక మాజీ నక్సలైట్ల పేరుతో బెదరింపులకు పాల్పడితే వారి సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



**-100 గ్రాముల గంజాయి స్వాధీనం..**

**బలగం టీవీ , సిరిసిల్ల**

గంజాయి నిందితుని అరెస్టు చేసి, 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, రిమాండ్ కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపానెరు. బుధవారం సిరిసిల్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మొగిలి మాట్లాడుతూ వేములవాడ మండలం జయ్యారం గ్రామనికి చెందిన డప్పుల వంశీ ఇంటర్మీడియట్ చదివే సమయంలో గంజాయికు అలవాటు పడ్డాడు అని అన్నారు.హైదరాబాద్‌లో సినిమాటోగ్రఫీ కోర్సు చేసే సమయంలో జల్సాలకు అలవాటు చేసుకొని అక్కడి నుండి వేములవాడకు వచ్చి ఇక్కడ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ అతనికి తెలిసిన వ్యక్తుల దగ్గర గంజాయిని కొని,అందులో కొంత తాను తాగి మిగిలిన దానిని ఎక్కువ ధరలకుఅమ్ముతుండేవాడని అన్నారు. గంజాయి అమ్ముతూ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ముస్తాబాద్ లో గంజాయి కి అలవాటు పడిన వారికి అమ్మాలని ముస్తాబద్‌కు వస్తున్నాడనే నమ్మదగిన సమాచారం ముస్తాబాద్ ఎస్సై ముస్తాబాద్ గ్రామ శివారులో తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానంగా కనిపించగా వ్యక్తి ని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు.అతని వద్ద నుండి 100 గ్రాముల గంజాయి,ఒక యాక్టివా స్కూటీ, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి, రిమాండ్ కుతరలించినట్లు తెలిపారు.





## లైంగిక వేదింపులు, పోక్సో చట్టాలపై అవగాహన

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓబులాపూర్ మరియు ప్రాథమిక పాఠశాల ఓబులాపూర్ పాఠశాల విద్యార్థినిలకు లైంగిక నేరాలు, పోక్సో చట్టాల గురించి అవగాహన కార్యక్రమం ఎస్ ఐ డి సుధాకర్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తంగళ్ళపల్లి ఎస్సై డి.సుధాకర్ , జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్ హాజరయ్యి మాట్లాడుతూ మహిళలపై ఎలాంటి నేరాలు జరిగినా1098 చైల్డ్ హెల్ప్ లైన్ కి కాల్ చేసి పిర్యాదు చేయాలని కోరారు. పోలీస్ శాఖ తక్షణమే స్పందిస్తుందని, అలాగే బాల బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచనలతో తంగళ్ళపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు.

బాలికలపై లైంగిక నేరాల నివారణ కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లైంగిక నేరాలు జరిగినట్లయితే వెంటనే కుటుంబ సభ్యులకి గాని గురువులకు గాని తెలియజేయాలని, తద్వారా బాలికలపై జరిగే నేరాలను నివారించే అవకాశం ఉంటుంది అని అన్నారు.వీటిపై అవగాహనను కల్పించినప్పుడు వారికి చైల్డ్ హెల్ప్ లైన్ 1098 మరియు పోలీస్ ఆధ్వర్యంలో 100 మరియు షి టీం నంబర్ లకుపిర్యాదు చేయాలని ప్రతి విద్యార్థికి 18 సంవత్సరాలలోపు పిల్లలకి వీటిపై అవగాహన ఉన్నప్పుడు ఇలాంటి తప్పులు జరగకుండా సమాజం తయారవుతుందని బాల్యవివాహాలు బాల కార్మికులను చైల్డ్ బెగ్గింగ్ మత్తు పానీయాల అలవాట్లని నివారించబడుతాయని చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పిహెచ్ఎస్ ఓబులాపూర్ హెచ్ఎం ఉపేందర్, ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఇన్చార్జి శైలజ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పుస్తె మట్టెలు అందజేత

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో పాడి రైతు చింతపెల్లి సత్యం రావు కవిత ల కూతురు అజిత వివాహనికి కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో నేరెళ్ళ రూట్ సూపర్ వైజర్ భానుచందర్ పుస్తె మట్టెలు అందజేశారు.ఈ సందర్భంగా భానుచందర్ మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీ అనేక సంక్షేమ కార్యక్రమాలు రైతుల కోసం చెపట్టిందని అందులో కళ్యాణమస్తు పథకంలో భాగంగా ఆడబిడ్డ పెళ్ళికి పుస్తె మట్టెలు అందజేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షులు మద్దెల సంతోష్,పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

## బిగ్ బాస్-8 టైమింగ్స్ ఫిక్స్

**బలగం టీవీ , హైదరాబాద్**

%పాపులర్ రియాల్టీ షో 'బిగ్ బాస్' షో స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్ అయింది. ఇప్పటికే ఏడు సీజన్లు పూర్తి చేసుకున్న బిగ్ బాస్ అక్కినేని నాగార్జున హోస్ట్‌గా 8వ సీజన్ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి, స్టార్ మా తాజా సీజన్-8 స్ట్రీమింగ్ తేదీలను ప్రకటించింది. బిగ్ బాస్ 8 సెప్టెంబర్ 1 ఆదివారం రాత్రి 7 గంటల నుండి ప్రసారం కానుందని స్టార్ మా అధికారికంగా తెలిపింది.సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ రాత్రి 9:30 గంటలకు బిగ్ బాస్ ప్రసారం కానుంది. అయితే శని, ఆదివారాలు రాత్రి 9 గంటలకు ప్రసారం అవుతుంది. గత సీజన్ మాదిరిగానే, ఈసారి కూడా హాట్‌స్టార్‌లో 24/7 ప్రసారం అవుతుంది.

## అక్కరకు రాని విగ్రహాలను కూల్చుడే..

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ , హైదరాబాద్**

తెలంగాణకు అక్కరకురాని వాళ్ళ బొమ్మలను తొలగిస్తాం... తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియాగాంధీని దెయ్యం, పిశాచి, బలిదేవత అన్న నువ్వా రాజీవ్ గాంధీమీద ప్రేమ ఒలకబోసేది అంటూ రేవంత్ పై మండిపడ్డారు. దొడ్డి దారిన పిసిసి ప్రసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్ గాంధీ మీద నువ్వు ఒలకబోస్తున్న కపట ప్రేమ అసలురంగు అందరికీ తెలుసంటూ విమర్శలు కురిపించారు. నీఆలోచనల్లో కుసంస్కారం.. నీ మాటలు అష్ట వికారం అంటూ విమర్శించారు. తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన నీ చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అది అవమానమేనని అన్నారు. గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో అట్లుంటది అంటూ చెప్పారు.. మళ్ళీ చెప్తున్నాం, రాసి పెట్టుకో . తెలంగాణకు అక్కరకురాని వాళ్ళ బొమ్మలను తొలగిస్తాం. తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తాం అని కేటీఆర్ పేర్కొన్నారు..

# నాటు తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్..

- కొనుగోలు చేసిన మరో ముగ్గురు వ్యక్తులు అరెస్ట్...
- గంభీరావుపేట పోలీస్ స్టేషన్ లో గతంలో కేసు నమోదు...
- ఎస్పీ అఖిల్ మహాజన్..





**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

నాటు తుపాకులు తయారు చేస్తున్న ఓ వ్యక్తి తో పాటు,కొనుగోలు చేసిన మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రెండు నాటు తుపాకీ లు, 3 ఇనుప బారెల్స్, 4 స్టిగర్లు మరియు సుత్తి, కత్తి, రంపపు, ఆకు రాయి, డ్రిల్లర్, ఇనుప రాడ్లు, బ్లోవర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ...

గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ నాటు తుపాకులు తయారు చేసి వాటిని అదే గ్రామానికి చెందిన అడవి జంతువులను వేటాడే వారికి అమ్ముతున్నాడన్న నమ్మదగిన సమాచారం మేరకు గంభీరావుపేట ఎస్ఐ తన సిబ్బందిని తీసుకొని గజసింగవరం గ్రామంలోని రాయలింగు శంకర్ ఇంటికి వెళ్లారు. అక్కడ రాయలింగు శంకర్ వివిధ పనిముట్ల ఉపయోగించి నాటు తుపాకులు తయారు చేస్తుండగా పట్టుకున్నారు. రాయలింగు శంకర్ వద్ద రెండు తుపాకి బ్యారెల్, తుపాకుల తయారు చేయడానికి వాడే రంపము, సుత్తి, కత్తి, ఆకు రాయి, డ్రిల్లింగ్ మిషన్ ,దూడ మిషన్, ఎయిర్ బుల్లోజర్ స్వాధీనం చేసుకొని నిందుతున్నీ పై కేసు నమోదు చేశారని అన్నారు.ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కేసు తదుపరి దర్యాప్తు ప్రారంభించగా దర్యాప్తులో భాగంగా గజసింగవారం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ వద్ద నాటు తుపాకులు కొనుగోలు చేసి జంతువుల వేటకు ఉపయోగిస్తున్న రాయలింగు చంద్రమౌళి, శాతవేణిహరీష్, లోగిడి గంగయ్య లను అదుపులోకి తీసుకొని వారి వద్ద రెండు తుపాకులు నాలుగు ట్రిగర్ భాగాలు స్వాధీనం చేసుకొని,నలుగురు నిందుతులను అరెస్ట్ చేసి,రిమాండ్ కి తరలించడం జరిగిందని అన్నారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసిన ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ రామ్మోహన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ ఐ లు రామ్మోహన్,రమాకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

# టెస్టు క్రికెట్‌కు అధిక ప్రాధాన్యత



- ట్యాలెంట్ ప్లేయర్ల కోసం ప్రత్యేక ప్రోగ్రామ్
- జై షా

**బలగం టీవీ, ముంబై**

టెస్టు క్రికెట్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు ఐసీసీకి నూతనంగా ఎన్నికైన చైర్మెన్ జై షా తెలిపారు. క్రికెట్ పురోగతికి అడ్డుగా నిలిచిన అన్ని అవరోధాలను తొలగించనున్నట్లు చెప్పారు. ఐసీసీ కొత్త చైర్మెన్‌గా జై షా ఎన్నికైన విషయం తెలిసిందే. డిసెంబర్ ఒకటో తేదీన గ్రేగ్ బార్‌క్లే నుంచి ఐసీసీ చైర్మెన్ బాధ్యతలను జే షా స్వీకరించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

చాలా కీలకమైన బాధ్యతను అప్పగించారని, మీ ఆశయాలకు తగినట్లు, అందమైన క్రికెట్ ఆటకు అంకిత అవుతానని షా తెలిపారు. టీ20 క్రికెట్ సహజంగా ఉత్సాహభరితమైన ఫార్మాట్ అని, కానీ దానికి సమానంగా టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎందుకంటే క్రికెట్‌కు అదే మూలాధారమైందని తెలిపారు. లాంగెస్ట్ ఫార్మాట్ క్రికెట్ ఆడేదిశగా క్రికెటర్లను మళ్లించాలని, ఆ దిశగా తమ ప్రయత్నాలు ఉంటాయన్నారు. ట్యాలెంట్ ప్లేయర్ల కోసం ప్రత్యేక ప్రోగ్రామ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఆట ప్రమాణాన్ని పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేయనున్నట్లు ఇచ్చారు.

# ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ విడుదల



**బలగం టీవీ, ముంబై**

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజా టెస్టు ర్యాంకింగ్స్‌ను బుధవారం రిలీజ్ చేసింది. ఈ ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా బ్యాటర్ల స్థానాలు మెరుగుపడగా, పాక్ ప్లేయర్ బాబర్ ఏకంగా ఆరు స్థానాలు కోల్పోయాడు. టీమ్‌ఇండియా బ్యాటర్లు విరాట్ కోహ్లీ 2 స్థానాలు, యశస్వీ జైశ్వాల్ 1 ప్లేస్ మెరుగుపర్చుకున్నారు. ప్రస్తుతం జైశ్వాల్ (740 రేటింగ్స్) 7వ స్థానం దక్కించుకోగా, విరాట్ (737 రేటింగ్స్?) 8వ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. కాగా, కెప్టెన్ రోహిత్ శర్మ 751 రేటింగ్స్‌తో 6వ స్థానంలో ఉన్నాడు.

ఇక పాక్ బ్యాటర్, లిమిటెడ్ ఓవర్ల కెప్టెన్ బాబర్ ఆజమ్ ఏకంగా 6స్థానాలు కోల్పోయాడు. బాబర్ ప్రస్తుతం 734 రేటింగ్స్‌తో 9వ ర్యాంక్‌కు పడిపోయాడు. మరోవైపు పాకిస్థాన్ మరో బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ 7స్థానాలు మెరుగు పర్చుకున్నాడు. రిజ్వాన్ 728 రేటింగ్స్‌తో 10వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఇక ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ (881 రేటింగ్స్) టాప్ ప్లేస్ నిలబెట్టుకున్నాడు. తర్వాత న్యూజిలాండ్ ఆటగాళ్లు కేన్ విలియమ్సన్ (859 రేటింగ్స్), డారిల్ మిచెల్ (768 రేటింగ్స్) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

## హైదరాబాద్‌ను మిస్ అవుతున్నా : డేవిడ్ వార్నర్

**బలగం టీవీ, హైదరాబాద్**




ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ హైదరాబాద్‌ను చాలా మిస్ అవుతున్నానని తెలిపాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు గతంలో సారథిగా వ్యవహరించిన అతడు ఆ తర్వాత అనివార్య కారణాలతో జట్టు నుంచి వెళ్లిపోయాడు.ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్ డేవిడ్ వార్నర్?కు తెలుగు క్రికెట్ ఫ్యాన్స్?కు మంచి అనుబంధం ఉంది. వార్నర్ తెలుగు హీరోల సినిమాల్లోని ఎన్నో సాంగ్స్‌ను రీల్స్‌గా చేసి ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సినిమాల్లోని పాటలకు స్టెప్పులు వేసి, డైలాగ్స్ చెప్పి తెలుగు ఆడియెన్స్‌కు మరింత దగ్గరయ్యాడు. దీంతో వార్నర్‌కు తెలుగు క్రికెట్ ఫ్యాన్స్‌తో చక్కటి అనుబంధం ఏర్పడింది. అయితే తాజాగా అతను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ వేదికగా హైదరాబాద్ ఐకాన్ అయిన చార్మినార్ ఫొటోను షేర్ చేస్తూ 'నాకు అత్యంత ఇష్టమైన ప్రదేశాన్ని మిస్ అవుతున్నా' అని రాసుకొచ్చాడు.

## ఆటకు డేవిడ్ మలన్ గుడ్‌బై

**బలగం టీవీ, ముంబై**



ఇంగ్లండ్ స్టార్ క్రికెటర్ డేవిడ్ మలన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో చివరిసారిగా బరిలోకి దిగిన 37 ఏళ్ల డేవిడ్ మలన్.. ఆ తర్వాత మళ్లీ ఇంగ్లండ్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఈ క్రమంలోనే ఇంటర్నేషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇంగ్లండ్ తరఫున డేవిడ్ మలన్ 22 టెస్టులు, 30 వన్డేలు, 62 టీ20లు ఆడాడు. 2020 సెప్టెంబర్‌లో టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కూడా కైవసం చేసుకున్నాడు. జోస్ బట్లర్ తర్వాత ఇంగ్లండ్ తరఫున మూడు ఫార్మాట్లలో సెంచరీలు సాధించిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు. టెస్టుల్లో, టీ20ల్లో ఒక్కో శతకం సాధించిన మలన్ వన్డేల్లో మాత్రం 6 సెంచరీలు నమోదు చేశాడు. టెస్టుల్లో 1074, వన్డేల్లో 1450, టీ20ల్లో 1892 రన్స్ చేశాడు.

# దక్షిణాఫ్రికాపై విండీస్ క్లీన్‌స్వీప్




**బలగం టీవీ, ట్రిండాడ్**

స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయిన వెస్టిండీస్ టీ20 ఫార్మాట్‌లో చెలరేగింది. మూడో టీ20లోనూ సఫారీలపై ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 3–0తో క్లీన్ స్వీప్ చేసింది. ట్రిండాడ్ వేదికగా జరిగిన ఈ మూడో టీ20కి వరుణుడు అంతరాయం కలిగించాడు. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 4.3 ఓవర్లకు 23/0తో ఉన్నప్పుడు వర్షం పడింది. దీంతో మ్యాచ్‌ను 13 ఓవర్లకు కుదించాలని అంపైర్లు నిర్ణయించారు. సౌతాఫ్రికా నాలుగు వికెట్లు కోల్పోయి 108 పరుగులు చేసింది. అయితే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో వెస్టిండీస్‌కు 13 ఓవర్లకు లక్ష్యం 116 పరుగులుగా నిర్ణయించారు.

దక్షిణాఫ్రికా బ్యాటర్లలో యువ ప్లేయర్ ట్రిస్టన్ స్టబ్స్ (40బీ 15 బంతుల్లో, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) దూకుడుగా ఆడాడు. కెప్టెన్ మార్క్‌రమ్ (20బీ 12 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్సర్) ఫర్వాలేదనిపించగా.. మిగిలిన బ్యాటర్లు ఆకట్టుకోలేకపోయారు. విండీస్ బౌలర్లలో షెఫర్డ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనకు దిగిన వెస్టిండీస్ 9.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. షై హోప్ (42 నాటౌట్ 24 బంతుల్లో, 1 ఫోర్, 4 సిక్సర్లు), నికోలస్ పూరన్ (35, 13 బంతుల్లో, 2 ఫోర్లు, 4 సిక్సర్లు), హెట్‌మెయిర్ (31 నాటౌట్, 17 బంతుల్లో, 4 ఫోర్లు, 1 సిక్సర్) విధ్వంసకర ఇన్నింగ్స్‌లు ఆడాడు. పూరన్ మరోసారి సిక్సర్ల వర్షం కురిపించాడు. అయితే ఛేదనలో వెస్టిండీస్‌కు పేలవారంభం లభించింది. ఓపెనర్ అథంజె (1బీ 3 బంతుల్లో) తొలి ఓవర్‌లోనే వెనుదిరిగాడు. కానీ హోప్‌తో కలిసి పూరన్ బౌండరీ, సిక్సర్లతో విరుచుకుడ్డాడు. పూరన్ ఔటైనా అదే జోరును హెట్‌మెయిర్ కొనసాగించాడు




## 100 రోజుల్లో 'పుష్ప ది రూల్'

**బలగం టీవీ, హైదరాబాద్**

మరో 100 రోజుల్లో 'పుష్ప ది రూల్' విడుదల కానున్నట్టు చిత్రబృందం ఒక పోస్టర్ విడుదల చేసింది. ఈ మేరకు కౌంట్‌డౌన్ షురూ చేసింది. అల్లు అర్జున్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2'. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే.

ప్రస్తుతం క్లైమాక్స్ షూటింగ్ జరుపుకుంటుంది ఈ చిత్రం. ఇక క్లైమాక్స్ అనంతరం శరవేగంగా పోస్ట్ ప్రోడక్షన్ పనులు స్టార్ట్ చేయబోతున్నట్లు తెలిపింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుండగా ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ, జగదీశ్ ప్రతాప్, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్ ఈ మూవీని నిర్మిస్తోంది.

## సీనియర్ రైటర్ కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలుగు సినీ పరిశ్రమలో విషాదం. టాలీవుడ్ సీనియర్ రైటర్ నడిమింటి నరసింగరావు (72) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలు వురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

'బొమ్మలాట' అనే నాటకం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న నరసింగరావు ఆ తర్వాత దూరదర్శన్‌లో ప్రసారమైన 'తెనాలి రామకృష్ణ' సీరియల్‌కు రైటర్‌గా పనిచేశాడు. ఈ సీరియల్ అప్పట్లో మంచి హిట్ అందుకుంది. అనంతరం 'వండర్ బాయ్', 'లేడీ డిటెక్టివ్', 'అంతరంగాలుస వంటి పలు సీరియల్స్‌కు రైటర్‌గా పని చేశాడు. టాలీవుడ్ స్టార్ దర్శకుడు కృష్ణవంశీ తెరకెక్కించిన మొదటి సినిమా 'గులాబీ' సినిమాతో పాటు రాం గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన 'అనగనగా ఒక రోజు' సినిమాలకు మాటల రచయితగా నరసింగరావు పనిచేశారు.

## రిలీజ్‌కు ముందే అవార్డులు, రికార్డులు

**బలగం టీవీ, హైదరాబాద్**

బుల్లితెర నటుడు ఆర్కే సాగర్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన 'ది 100' మూవీ రిలీజ్‌కు ముందే పలు రికార్డులను బ్రేక్ చేసి ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డుల్లో జ్యూరీ అవార్డు అందుకోగా, తాజాగా మరో ఘనత సాధించింది. ముంబయి వేదికగా త్వరలో జరగనున్న 12వ ఇండియన్ సినీ ఫిల్మ్ ఫెస్టివల్ ఈవెంట్‌లో ఈ చిత్రాన్ని ప్రదర్శించన్నారు. దీంతో పాటు బెస్ట్ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ సౌండ్ డిజైన్ లిస్ట్‌లో పలు హాలీవుడ్ అవార్డులను సైతం ఈ చిత్రం అందుకున్నట్టు మేకర్స్ తాజాగా వెల్లడించారు.